ప్రచురణార్థం/ ప్రసారార్థం : విజయవాడ,

**తేదీ : 31.5.2018.**

**ఈ రోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యాలయం (కాట్రగడ్డ శ్రీనివాసరావు భవన్)లో జరిగిన ప్రెస్‌మీట్ నోట్ ప్రచురణార్థం మీడియాకు పంపుతున్నాము.**

**– జె.ప్రభాకర్**

**ఆఫీసు కార్యదర్శి**

## భూ సేకరణ చట్ట సవరణ అమానుషం

2013 భూసేకరణ చట్టానికి సవరణలు చేయడం అమానుషమని, ఈ సవరణల ద్వారా బహుళజాతి సంస్థలకు, కార్పొరేట్లకు భూములు కట్టబెట్టేందుకు తెలుగుదేశం ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు.

రైతుల నుండి భూములు గుంజుకునేందుకు వీలుగా చట్టంలో సవరణలు పెట్టారని, దీన్ని వెనక్కు తీసుకోవాలని అన్నారు. గతంలో కేంద్రం కూడా ఇలాగే సవరణలు పెడితే ప్రజా ఆందోళనతో వెనక్కు తగ్గిందనే విషయాన్ని చంద్రబాబు గుర్తించాలన్నారు. బిజెపి కంటే భిన్నమైన వ్యక్తులమని చెప్పుకుంటున్న చంద్రబాబు ఆ పార్టీ విధానాలనే అనుసరిస్తున్నారని తెలిపారు. భూ సంబంధిత సమస్యలపై వెంటనే అఖిలపక్ష సమావేశం జరపాలని డిమాండ్ చేశారు. బిజెపితో పోటీ పడి ప్రజలపై భారాలు వేసి గోళ్లూడకొడుతూ పైగా తానేదో ప్రజానుకూల విధానాలను అనుసరిస్తున్నానని చెప్పడం సరికాదన్నారు. పెట్రోల్ రేటు పైసా తగ్గించి బిజెపి ప్రజలను అపహాస్యంపాలు చేస్తే కేరళ ఆదర్శంగా రూపాయి తగ్గించి చేతల్లో ఆదర్శం చూపిందన్నారు. అదే మార్గంలో చంద్రబాబు ప్రభుత్వం కూడా పెట్రోల్‌పై పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. మహానాడులో కూడా తాము 100 శాతం హామీలు అమలు చేశామని చెబుతున్నారని, ప్రజల సమస్యలు, వారి బాధలపై చర్చ లేకుండానే వారికి వారే 100 మార్కులు వేసేసుకున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. టిడిపి జరిపింది మహానాడు కాదని, ఒట్టినాడని తెలిపారు. పైగా నవ నిర్మాణ దీక్షల పేరుతో ప్రజాధనంతో హడావుడి చేస్తున్న ప్రభుత్వం సమస్యలపై చర్చ నుండి ప్రజలను పక్కదారి పట్టిస్తోందని అన్నారు. ప్రభుత్వాలు చేయాల్సింది దీక్షలు కాదని, చేతల్లో మేలు చేసి చూపించాలని అన్నారు. పెన్షన్లు కూడా అర్హులకు ఇవ్వడం లేదని అన్నారు. జన్మభూమి కమిటీలు కాదని, రియల్‌టైమ గవర్నెన్స్ ద్వారా పింఛన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అంటే ఇప్పటి వరకూ ఉన్న జన్మభూమి కమిటీలు వైఫల్యం చెందాయని, ఏకపక్షంగా వ్యవహరించాయని ప్రభుత్వం అంగీకరించినట్లయిందన్నారు. జన్మభూమి కమిటీలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ రాష్ట్రంలో పెన్షన్ల సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే అందరికీ పెన్షన్లు అందేలా చూడాలని అన్నారు.

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు వెళ్లడం లేదన్నారు. జంఝావతి, వెలిగొండ ప్రాజెక్టులు పూర్తి కాలేదన్నారు. వేరుశనగ, శనగ, సుబాబుల్, పత్తి పంటలకు ధర లేదని, ధాన్యం కూడా ధర తగ్గిందని అయినా ప్రభుత్వం సంక్షేమం గురించి గొప్పలు చెబుతోందన్నారు. చంద్రబాబు చేసే ప్రతి కార్యక్రమం రాజకీయ లబ్ధికోసమే అన్నట్లు ఉంటోందని, దీన్ని ప్రజలు సహించబోరని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో జాతీయస్థాయిలో పెద్దఎత్తున ప్రకటనలు గుప్పించారని, విదేశీ కంపెనీలకు 24 గంటల్లో ఆన్‌లైన్లో సమస్యలు పరిష్కరిస్తామని చెబుతున్నారని, రాష్ట్రంలో ఇళ్ళు, ఇళ్లస్థలాలు, పెన్షన్ల కోసం చేసుకున్న దరఖాస్తులను మాత్రం పరిశీలించే తీరిక ప్రభుత్వానికి లేకుండా పోయిందన్నారు.

దీక్షల పేరుతో, మహానాడు పేరుతో విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు పెడుతున్నారని, దీనివల్ల ప్రయాణికులు, రోజువారీ కూలీ పనులు చేసుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీక్షలంటే ప్రతిపక్షాలకు అనుమతులివ్వడం లేదని, అదే అధికార పార్టీ మాత్రం ప్రధాన కేంద్రమైనా బెంజిసర్కిల్లో దీక్షలు పెడుతూ ఇష్టారాజ్యం చేసుకుపోతోందని, ఇది పూర్తి నియంతృత్వ ధోరణిగా ఉందని అన్నారు. దీక్షల పేరుతో వేలకోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా త్వరలోనే కార్యాచరణ చేపడతామని అన్నారు.

= = = =